సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం ¦ 26 ¦ ఫిబ్రవరి ¦ 2024



అభివృద్ధికి కృషి చేస్తా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహ కారంతో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. -8లో



అంతర్ పంటల సాగుతో లాభాలు

అంతర్ పంటల సాగుతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. ముఖ్యంగా టమాటా పంట సాగులో బీన్స్, చిక్కుళ్లు, కాకరలను అంతర్ పంటలుగా సాగు చేస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.160
రెండోరకం	రూ.70	రూ.116

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 118 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	354	410
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 788.080 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీక రించి వాటి పరిష్కారానికి నేడు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తె ఆదివారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పం దన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

వెండి ఆభరణాలు వితరణ



వృషభాచలేశ్వరస్వామికి వెండి ఆభరణాలను అందిస్తున్న భరత్‌కుమార్ దంపతులు

వేంపల్లె: పవిత్ర పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దు లకొండపై వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలోని వృషభాచలేశ్వరునికి భక్తులు 850 గ్రాముల వెండి ఆభరణాలను విత రణ చేసినట్లు ఆలయ ఈఓ. శ్రీధర్, చైర్మన్ కుర్రా కుల వెంకటేష్‌లు తెలిపారు. ఆదివారం ఉదయం అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు చెం దిన సగళా నాగిశెట్టి.. కన్యాకుమారి దంపతుల కుమారుడు భరత్‌కుమార్, సతీమణి శ్రావణిలు స్వామివారికి వెండి సాలి గ్రామాల మాల, వెం డి నామాన్ని అర్చకులు హరిప్రవీణ్‌కు అందిం చారు. దేవస్థానం ఆధ్వర్యంలో దాతలను సత్క రించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కబడ్డీ సీనియర్ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్: కడపలోని శివశివానీ హైస్కూల్ మైదానంలో ఆదివారం జిల్లాస్థాయి కబడ్డీ సీని యర్ విభాగం ఎంపికలు జరిగాయి.. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ (రిజిష్టర్డ్ 115/2010) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలను సంఘం అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి టి. జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు మార్చి 8 నుంచి 10 వరకు నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొ నాల్సి ఉంటుందని తెలిపారు.

చిరుత సంచారం



చిరుత దాడిలో గాయపడిన మేకతో భాగ్యమ్మ

సిద్దవటం: మండలంలోని జంగాపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో రాత్రివేళ చిరుత సంచారం చేస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెం దుతున్నారు. చిరుత పులి తాగునీటి కోసం అటవీ ప్రాంతం నుంచి రాత్రి వేళల్లో గ్రామీణ ప్రాంతాల్లోకి వస్తోంది. శనివారం రాత్రి చిరుత జంగాలపల్లిలోని పాలెం భాగ్యమ్మ అనే మహిళ పూరి గుడిసెలో మేకలు గట్టిగా అరవడంతో ఆమె ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. మేకపై చిరుత దాడి చేస్తుండగా ఒక్కసారిగా ఆమె కేకలు వేయడంతో చిరుత మేకను వదిలేసి అడవిలోకి పారిపోయింది. చిరుత దాడిలో గాయపడిన మేకకు సిద్దవటం పశువైద్య శాలలో వైద్యం చేయించారు. ఈ విషయమై ఫారెస్టు రేం జర్ కళావతిని వివరణ కోరగా తాగునీటి కోసం చిరుత గ్రామంలోకి వచ్చిందని , గ్రామస్తులు జాగ్రతగా ఉండాలని చెప్పామన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు


- కర్ణాటక సరిహద్దులో మృత్యుఘోష
- పాడిరైతులను ఢీకొన్న స్కార్పియో, ఇద్దరు మృతి
- తప్పించుకునే క్రమంలో వేగంగా లారీని ఢీకొన్న స్కార్పియో
- డ్రైవర్‌తో సహా ఇద్దరు మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన స్కార్పియో (ఇన్‌సెట్) విక్రమ్ ఫైల్‌ఫోటో



ప్రమాదంలో మృతిచెందిన రైతు చంద్రప్ప



స్కార్పియో ఢీకొన్న లారీ



రైతు సుబ్రహ్మణ్యం మృతదేహం





మృతిచెందిన తిలక్ (ఫైల్) శ్రీనాథ్ (ఫైల్)

మదనపల్లె: అన్నమయ్యజిల్లా మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ఆదివారం రాత్రి ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మద్యం మత్తులో స్కార్పియో వాహనాన్ని వేగంగా నడుపుతూ.. ఎదు రుగా వస్తున్న రెండుకార్లు, రోడ్డుపై నిల్చున్న ఇద్దరు రైతులను ఢీకొని, అదుపుచేయలేని స్థితిలో లారీని ఢీకొని, ఐదుగురిని మృత్యువాతపడేలా చేసిన ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాదతీవ్రతకు స్కార్పియో వాహనం నుజ్జునుజ్జు కావడంతో పాటుగా డ్రైవర్ తల ఎగిరి మొండెం కిందపడింది. వాహనంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కడప–బెంగ ళూరు జాతీయరహదారిపై మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాద ఘటన షాక్‌కు గురిచేసింది. ప్రమాదం జరిగిన తీరు, మృతదేహాలు ఛిద్రమైన వైనం, వాహనం నుజ్జునుజ్జు చూస్తుంటే.. మృత్యువు దూసుకొచ్చినట్లుగా కనిపిస్తోంది. ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురు మదన పల్లెకు చెందినవారే కావడం బాధాకరం. ఘటనకు సంబంధించిన వివరాలు..

మదనపల్లె పట్టణం దేవతానగర్‌కు చెందిన చలపతి కుమారుడు సుంకరవిక్రమ్(38) అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ 8నెలల క్రితం తిరిగి వచ్చాడు. స్థానికంగా తిరిగేందుకు ఏపీ–39, ఎస్ జే–8439 స్కార్పియో వాహనాన్ని కొనుగోలు చేశాడు. అమ్మచెరువుమిట్టకు చెందిన ఆటోడ్రైవర్ మల్లికార్జున కుమారుడు తిలక్(19) స్థానికంగా ఓ డిగ్రీ కళాశాలలో మొదటిసంవత్సరం చదువుతున్నాడు. తట్టివారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు శ్రీనాథ్(25) ఆర్మీ ఉద్యోగాలకు శిక్షణ తీసుకుంటున్నాడు. రామారావుకాలనీకి చెందిన చరణ్‌కుమార్(25), హరీష్(33), మహేష్(31)లు స్నేహితులు. వీరు ఆరుగురు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలవరకు మదనపల్లెలోనే ఉన్నారు. తర్వాత మద్యం తాగుందుకు కర్ణాటకకు వెళ్లాలని నిర్ణయించుకుని విక్రమ్‌ను స్కార్పియో వాహనం తీసుకురమ్మని కోరారు. వాహనంలో ఆరుగురు కలిసి కర్ణాటకకు వెళ్లారు. అక్కడ సాయంత్రం వరకు మద్యంతాగి మదనపల్లెకు బయలుదేరారు. కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్ట్‌లో బారికేడ్లను ఢీకొన్నారు. అక్కడ పోలీసులు తమను పట్టుకుంటారేమోనన్న భయంతో వాహనాన్ని వేగంగా నడుపుతూ, ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. అలాగే వస్తూ.. మరో కారు సైడ్‌మిర్రర్‌ను ఢీకొని, వేగంగా ప్రయాణిస్తున్నారు. అదేసమయంలో చీకలబైలు పంచాయతీ కోళ్లవారిపల్లెకు చెందిన కరమల సుబ్రహ్మణ్యం ఆచారి అలియాస్ కాళిదాసు(55), యల్లుట్ల చంద్రప్ప(50) బార్లపల్లె పాలడిపోలో పాలుపోసి, రోడ్డుపై నిల్చున్నారు. వేగంగా వస్తున్న స్కార్పియో వాహనం రోడ్డుకు అటువైపు నిల్చున్న వీరిద్దరినీ ఢీకొంది. వాహనం ఢీకొన్న ధాటికి రైతులు ఇద్దరూ ఎగిరి కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. దీంతో స్థానికులు అరుపులు, కేకలు వేయడంతో ఆందోళన చెందిన విక్రమ్ స్కార్పియో వాహనాన్ని మరింత వేగం పెంచాడు. మితిమీరిన వేగంలో వాహనాన్ని అదుపుచేయలేక, వెనుక పరిగెత్తుకుని వస్తున్న వ్యక్తులను గమనిస్తూ, ఏమరుపాటులో ఎదురుగా వస్తున్న బోరుసామగ్రి తరలించే లారీని ఢీకొన్నాడు. దీంతో స్కార్పియో గాల్లోకి ఎగిరిలేచింది. టాప్ ఎగిరిపోయి కిందపడ్డ దెబ్బకు డ్రైవర్ విక్రమ్ తల తెగి మొండెం కిందపడింది. వాహనంలో ఉన్నటువంటి తిలక్, శ్రీనాథ్ అక్కడికక్కడే మృతిచెందారు. చరణ్‌కుమార్, హరీష్, మహేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో తాలూకా సీఐ ఎన్.శేఖర్, 108 సిబ్బందిని అప్రమత్తం చేసి క్షతగాత్రులను హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో చరణ్ కుమార్, హరీష్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. మహేష్ మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు.

కర్ణాటకకు వెళ్లి మద్యం తాగి వచ్చే వాహనాలతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రతిరోజు భయపడి బతకాల్సిన పరిస్థితి వస్తోందని బార్లపల్లె గ్రామస్తులు వాపోయారు. బెంగళూరు జాతీయరహదారిపై బార్లపల్లె వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడం ప్రమాదానికి ప్రమాదకారణమని వారు ఆరోపించారు. చనిపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ కడప–బెంగళూరు జాతీయరహదారిపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ హరిప్రసాద్, డీఎస్పీ ప్రసాదరెడ్డి, ఎంవీఐ దినేష్‌చంద్రలు ఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పరామర్శ



తిలక్ తండ్రి మల్లికార్జునను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లెకు చెందిన వ్యక్తులు రోడ్డుప్రమాదంలో మృతిచెందారన్న వార్త తెలియగానే వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకావెంకటాచలపతితో కలిసి జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే ఎంపీ మిథున్‌రెడ్డి ఫోన్‌లో బాధితులను పరామర్శించాల్సిందిగా నిసార్‌అహ్మద్, జింకాచలపతిలను ఆదేశించారు. మృతిచెందిన రైతుల నష్టపరిహారిహారానికి సంబంధించి వివరాలు పంపాలని తెలిపారు. విషయం తెలిసిన పదినిమిషాల్లోపే 108 వాహనాలు ప్రమాదస్థలానికి వెళ్లాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాయి. తాలూకా సీఐ శేఖర్, టూటౌన్ సీఐ యువరాజ్ ఘటనాస్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు.

క్షణకాలంలో ఘోర ప్రమాదం

రాత్రి 7.40 గంటల సమయం. పల్లె ప్రశాంతంగా ఉన్న సమయంలో రోడ్డుపై దూసుకొచ్చిన ఓ వాహనం లారీని ఢీకొని గాల్లోకి ఎగిరి అందులోని వ్యక్తులు చెల్లాచెదురుగా కిందపడిన వైనం ఒక్కసారిగా భయాన్ని కల్పించిందని ప్రత్యక్షసాక్షి, బార్లపల్లె గ్రామస్తురాలు పద్మావతి తెలిపారు. స్కార్పియో వాహనం వేగంగా రావడం చూసిన తాను ఎక్కడ ఢీకొడుతుందోనని, ముందుగానే లారీని మార్జిన్‌లో నిలిపేశానని, అయితే దూసుకొచ్చి మరీ ఢీకొని గాల్లోకి లేచిందని తమిళనాడుకు చెందిన బోరు లారీ డ్రైవర్ దినేష్ చెప్పుకొచ్చాడు. కళ్లముందే ముగ్గురి ప్రాణాలు ఘోరంగా పోవడం తనను కలిచివేసిందని, షాక్ నుంచి తేరుకోలేకపోయానని భయపడుతూ చెప్పాడు. ప్రమాదంలో పేద కుటుంబాలకు చెందిన రైతులు చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

రమేష్‌రెడ్డికి సీటు పోటు..!

- రెడ్డెప్పగారి రాజకీయ వారసుడిగా ఆరంగ్రేటం
- ఎమ్మెల్యేగా ఎన్నిక, ఆపై టీడీపీ నేతగా విధేయత
- ప్రత్యామ్నాయంగా ఎదిగిన సోదరుడు శ్రీనివాసులరెడ్డి
- ధనంతుడు కావడంతో చేరదీసిన టీడీపీ అధిష్టానం
- యూజ్ అండ్ త్రో పాలసీ అమలు చేసిన చంద్రబాబు



రమేష్‌కుమార్‌రెడ్డి



శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ అధికారిక పగ్గాలు చేపట్టిన నాటి నుంచి అధినేత చంద్రబాబు యూజ్ అండ్ త్రో పాలసీ అమలు చేయడంలో దిట్టగా పేరు గడించారు. అవసరాలకు అనుగుణంగా నాయకులను వాడుకోవడంలో ఆయనకు మరెవ్వరు సాటి రారని విశ్లేషకులు సైతం అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అలాంటి పరిస్థితి తాజాగా మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డికి ఎదురైంది. రెడ్డెప్పగారి కుటుంబం రాజకీయ వారసుడిగా తెరపైకి వచ్చిన ఆయనకు అటు ఇంటి నుంచి ఇటు పార్టీ నుంచి సీటు పోటు తప్పలేదు. 25 ఏళ్లుగా పార్టీ విధేయునిగా ఉన్నా, అసెంబ్లీ సీటు దక్కకపోవడానికి సోదరుడి సారథ్యమే ప్రధాన కారణమని సమాచారం.

దివంగత మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి రాజకీయ వారసుడిగా రమేష్‌కుమార్‌రెడ్డి అరంగ్రేటం చేశారు. 1999లో లక్కిరెడ్డిపల్లె ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో ఓటమి తర్వాత, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో లక్కిరెడ్డిపల్లె రద్దు అయింది. రాయచోటి నియోజవకర్గంలో లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మూడు మండలాలు కలిసిపోయాయి. 2009 ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి సాయిప్రతాప్ చేతిలో ఓడిపోయారు. 2014, 19లలో రాయచోటి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. రమేష్‌రెడ్డి 1999 నుంచి ఇప్పటి వరకు టీడీపీ నాయకుడుగా చెలామణీ అవుతున్నారు. కాంట్రాక్టర్‌గా స్థిరపడిన సోదరుడు శ్రీనివాసులరెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2014లో తొలిసారి అరంగ్రేటం చేసిన వెంటనే కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా ఓడిపోయారు. క్రమంగా టీడీపీ సారధ్య బాధ్యతలకు దగ్గరయ్యారు. అధినేత చంద్రబాబు మనుసెరిగి మసులుకోవడంలో దిట్టగా మారడంతో టీడీపీలో పొలిట్‌బ్యూరో సభ్యుడుగా ఎదిగారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కుటుంబానికి ఒక్కటే సీటు నిబంధన....

తెలుగుదేశం పార్టీలో ఇటీవల అనధికారికంగా కుటుంబానికి ఒక్కటే సీటు అనే నిబంధన పెట్టుకున్నారు. ఈక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్న శ్రీనివాసులరెడ్డి ఆ ఒక్క సీటు మా సోదరుడు రమేష్‌కుమార్‌రెడ్డికి ఇవ్వాలని అభ్యర్థించి ఉంటే తప్పకుండా వచ్చేదని పలువురు వివరిస్తున్నారు. అలా కాకుండా తన సతీమణి మాధవీరెడ్డికి కడపలో అవకాశం కల్పించాలని శ్రీనివాసులరెడ్డి కోరడంతోనే రమేష్‌రెడ్డి సీటు ప్రశ్నార్థమైనట్లు సమాచారం. 1999 నుంచి రాజకీయాల్లో కొనసాగుతూ బాధ్యతగా, విధేయుతతో పనిచేస్తున్న తనను కాదని, నిబంధనలు ముడిపెట్టి తనకు ఎగనామం పెడతారా? అన్న ఆక్రోశం రమేష్‌రెడ్డి వెళ్లగక్కుతున్నారు.

అవకాశవాద రాజకీయాలతోనే..

నిబద్ధతతో రాజకీయాలు చేసేవారు కొందరైతే, అందివచ్చిన అవకాశాలతో ఎదిగే నేతలు మరికొందరు. చేయి అందించిన వారినే తొక్కుకుంటూ ఎదిగే నేతలు మరికొందరు. చంద్రబాబు తెరపైకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి అవకాశవాదులు అధికమయ్యారు. ఇలాంటి పరిస్థితితోనే రాయచోటి సీటు చేజార్చుకోవాల్సి వచ్చిందని రమేష్‌రెడ్డి సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. రాయచోటి సెగ్మెంట్‌లో మాధవీరెడ్డి అభ్యర్థిత్వం ఖరారు చేసినా ఇంతటి క్షోభ ఉండేది కాదని, సొంత నియోజకవర్గం రెడ్డెప్పగారి కుటుంబం నుంచి చేజార్చుకునే పరిస్థితి లేకుండా ఉండేదని పలువురితో వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా రాజకీయ భవిష్యత్ కోసం స న్నిహితులతో ప్రత్యేకంగా చర్చిస్తూ, రాయచోటి నుంచి పోటీ చేయాలనే దిశగా అడుగులు వేస్తూ, తదనుగుణంగా సమీకరణలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రశాంతంగా గ్రూప్–2 పరీక్షలు



రాయచోటిలో పరీక్ష కేంద్రం పరిశీలనకు వెళుతున్న జిల్లా ఎస్పీ బి కృష్ణారావు తదితరులు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో ఆదివారం జరిగిన గ్రూప్–2 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డీఐజీ విజయారావు, జిల్లా ఎస్పీ బి కృష్ణారావులు కూడా పరీక్షా కేంద్రాలను సందర్శించి నిర్వహణపై చిన్నపాటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టారు. జిల్లా పరిధిలోని రాయచోటి, మదనపల్లి, రాజంపేట, పీలేరు ప్రాంతాలలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 14 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 7425 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 6161 మంది హాజరయ్యారు. దీంతో అభ్యర్థుల హాజరు శాతం 83 శాతంగా నమోదైందన్నారు. ఏపీపీఎస్సీ విజయవాడ కార్యాలయం నుంచి వచ్చిన సెక్షన్ అధికారులు ప్రతాప్, రాజశేఖర్‌లు పరీక్షలు సజావుగా జరగడానికి సహకారం అందించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

రైల్వేస్టేషన్లకు అమృత్ యోగం



రాజంపేట రైల్వేస్టేషన్



మదనపల్లె: వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లుచేస్తున్న అధికారులు

- ఉభయజిల్లాల్లో మూడుస్టేషన్లకు మహర్దశ
- 53 రకాల సదుపాయాలతో అభివృద్ధికి చర్యలు
- నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

రాజంపేట/మదనపల్లె: అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో ముంబై–చెన్నై రైలుమార్గంలో కడప, రాజంపేట, మదనపల్లె రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. గుంతకల్ రైల్వే డివిజన్‌లో 15 స్టేషన్లలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన మూడు రైల్వేస్టేషన్లను ఎంపిక చేశారు. ఈనెల 26న ఉదయం 10–11గంటల మధ్య ఈ పనులకు దేశ ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద 53 రకాల సదుపాయాల కల్పన దిశగా పనులు ఉన్నాయి. అమృత్‌భారత్ కింద రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు కడపకు రూ.25.35కోట్లు, రాజంపేటకు రూ.5.53కోట్లు, మదనపల్లెకు రూ.8.కోట్లు మంజూరు చేశారు. పనులను వీడియోలింక్ ద్వారా ప్రారంభిస్తారు. పూర్తయిన ఆర్‌యూబీలను అంకితం చేయనున్నారు. ఇందుకోసం రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం అమలులో భాగంగా ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేశారు. ఈ నేపథ్యంలో నిపుణుల కమిటీ పరిశీలన చేసింది. అనంతరం బడ్జెట్‌ను రూపొందించి దశలవారీగా స్టేషన్ల అభివృద్ధిపనులు చేపడతారు.

ప్రధానసౌకర్యాలు ఇవే..

కడప, మదనపల్లె, రాజంపేట,రైల్వేస్టేషన్లలో భవనాలు, ఫ్లోరింగ్ ఆధునికశైలితో నిర్మించనున్నారు. ప్లాట్‌ఫాం పొడవును కూడా పెంచనున్నారు. 600 మీటర్ల ఉన్న ప్లాట్‌ఫాంలు 760 మీటర్ల నుంచి 840 మీటర్ల వరకు పొడిగించే అవకాశాలున్నాయి.

అమృత్ భారత్ నిధులు

కడప: రూ.25 కోట్లు

రాజంపేట: రూ.5.53 కోట్లు

మదనపల్లె: రూ.8 కోట్లు

- స్టేషన్లలో రైలుపట్టాల పరిశుభ్రత కోసం బ్యాలస్టలెస్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు.
- దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లు, ప్రత్యేక ప్రవేశమార్గాలు, ఇతర సదుపాయాలు ఉంటాయి.
- వెయిటింగ్‌హాల్స్, వాటికి అనుబంధంగా కేఫ్‌టేరియా, స్థానిక ఉత్పత్తుల విక్రయానికి కనీసం రెండుస్టాల్స్‌ను ఏర్పాటుచేయనున్నారు.
- ప్రతి స్టేషన్ మొదటి అంతస్తులో రూఫ్‌ప్లాజా, సమావేశ మందిరాలు నిర్మించనున్నారు.
- స్టేషన్‌కు రెండువైపులా అప్రోచ్‌రోడ్లు, పార్కింగ్ ఏరియా, పాదాచారులకు ప్రత్యేకదారి – ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్, వేగవంతమైన వైఫై సేవలకు 5 జీ టవర్లు ఏర్పాటు సే దిశగా మాస్టర్‌ప్లాన్ చేశారు.

ఆయూబీలివే..

అన్నమయ్య జిల్లాలో బొజ్జవారిపల్లె, అనంతరాజంపేట, ఓబులవారిపల్లె, గాదెల, తిక్కంపల్లె, అప్పరాజుపేట, జాగువారిపల్లె, అచ్చంపేట, కడపలో కమ్మవారిపల్లె, కే.సుగమంచిపల్లె

స్టేషన్ల అభివృద్ధిపై ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టి



రాజంపేట, మదనపల్లె స్టేషన్ల అభివృద్ధిపై ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టి సారించారు. అందువల్లే అమృత్ భారత్ పథకంలో అభివృద్ధి చేసే జాబితాలో చేరింది. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె తదితర ప్రాంతాల్లో ఆర్‌యూబీల మంజూరుకు ఎంపీ కృషి చేశారు. –తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు, ఓబులవారిపల్లె

సంతోషంగా ఉంది



మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి తన వంతు కృషిచేశారు. దీంతో అమృత్‌భారత్ పథకంలో మదనపల్లె రోడ్ స్టేషన్ అభివృద్ధికి బీజం పడింది. ఇక్కడ రోడ్‌స్టేషన్ ఆధునికీకరణ పనులు చేపట్టడం సంతోషంగా ఉంది. –బీ.ఈశ్వరమ్మ, సర్పంచి, పీటీఎం క్రాస్‌రోడ్

క్లుప్తంగా

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన లక్ష్మీ

పీలేరు రూరల్ : అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం పీలేరు పట్టణం బండ్లవంకలో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లవంకకు చెందిన మహేష్ భార్య పి. లక్ష్మీ (20) తన ఆరోగ్య సమస్యలతో ఆదివారం మధ్యాహ్నం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ నెల 27 నుంచి మార్చి 9 వరకు ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్

రాయచోటి టౌన్ : ఈనెల 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నాలుగు కేంద్రాల్లో ఏపీ టెట్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2024 నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పరీక్షలు కేటాయించిన సెంటర్లలో రెండు సెషన్ల ద్వారా నిర్వహిస్తామన్నారు. మొదటి సెషన్ ఉదయం 9–30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే రెండవ సెషన్ మధ్యాహ్నం 2–30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌లను https://aptet.apcfss.in ద్వారా పొందవచ్చన్నారు.

అన్నమయ్య జిల్లాలోని పరీక్ష కేంద్రాలు

1. విశ్వం ఇంజినీరింగ్ కళాశాల, అంగళ్లు, మదనపల్లె
2. ఆదిత్యా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, మదనపల్లె
3. అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, తాళ్లపాక పంచాయతీ, బోయనపల్లె, రాజంపేట
4. శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, రాయచోటి

అంతర్ పంటల సాగుతో రైతులకు లాభాలు

- టమాటాలో అంతర్ పంటలుగా బీన్స్, చిక్కుడు, కాకర
- ఏక కాలంలో రెండు పంటల సాగు
- నష్టాల నుంచి బయటపడుతున్న రైతులు



టమాటాలో అంతర్ పంటగా సాగు చేసిన కాకర తోటలు

గుర్రంకొండ : అంతర్ పంటల సాగుతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. ముఖ్యంగా పడమటి మండలాల్లో రైతులు అంతర్ పంటల సాగుపై దృష్టి సారిస్తూ నష్టాలను అధిగమిస్తున్నారు. ముఖ్యంగా టమాటా పంట సాగులో బీన్స్, చిక్కుళ్లు, కాకరలను అంతర్ పంటలుగా సాగు చేస్తున్నారు. దీంతో ఏక కాలంలో రెండు పంటలను సాగు చేస్తూ తద్వారా పంటసాగు ఖర్చు ఆదా చేసుకుంటున్నారు. ఒక పంట నష్టపోయినా మరో పంటైనా చేతికొస్తుండడంతో రైతులు ఈ విధానంతో లాభాల బాట పడుతున్నారు.

బీన్స్ పంట..

ఎకరం పొలం దుక్కుల దగ్గర నుంచి కాయలు కాసే వరకు మొత్తం ఖర్చు రూ. 25 వేలు లోపే ఖర్చు వస్తుంది. విత్తనాలు నాటిన 40 రోజులుకు బీన్స్‌కాయల దిగుబడి ప్రారంభమవుతుంది. కేవలం రెండు కోతలకే పంట మొత్తం ఖాళీ కావడం ఈ పంట ప్రత్యేకత. వరిపంటలాగా ప్రతి రోజు నీరు కట్టాల్సిన అవసరం లేదు. ఐదు రోజుల కొకమారు నీరుపెట్టినా సరిపోతుంది. ఎకరానికి నాలుగుటన్నుల నుంచి ఐదు టన్నుల కాయలు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో బీన్స్ ధర రూ.40 పలుకుతోంది. ఈ లెక్కన ఎకరానికి రూ. 1.60 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పంట ఖర్చుపోను రూ.75 లక్షల వరకు లాభం వస్తుండడంతో రైతులు అంతర్ పంటగా బీన్స్ సాగు చేస్తుంటారు.

చిక్కుడు పంట..

ఎకరం చిక్కుడు సాగు కోసం దుక్కుల దగ్గర నుంచి కాయలు కోత పడే వరకు రూ. 30 వేలు నుంచి రూ.40 వేలు వరకు ఖర్చు వస్తుంది. విత్తనాలు నాటినప్పటి నుంచి 90 రోజులకు పంట దిగుబడి మొదలవుతుంది. చిక్కుడు పంట దిగుబడి మొత్తం 20రోజులు లోపే పూర్తి అవుతుంది. పంటకాలం మొత్తం మూడు కోతలతో ముగియడం ఈ పంట ప్రత్యేకత. అయితే పంట కాలం ముసిగిన తరువాత మళ్లీ దుక్కులు, ఎరువులు వినియోగిస్తే తిరిగి 20 రోజుల్లోపే రెండవ దశ కాయలు కాయడం దీని ప్రత్యేకత. ఒక ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ల పంట దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో చిక్కుళ్లు రూ. 60 నుంచి రూ.70 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈ లెక్కన ఎకరానికి రూ.1.20లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పంట సాగు ఖర్చు పోను ఎకరానికి రూ. లక్షకు పైగా ఆదాయం సమకూరుతుంది.

కాకర పంట..

ఎకరం కాకర సాగుకు దుక్కుల దగ్గర నుంచి కాయలు కోతకు వచ్చేంత వరకు రూ.40 వేలు ఖర్చు వస్తుంది. చెట్టు ఎదుగుదలకు, పూతపిందె నిలవడానికి గాను పదిరోజుల కొక మారు మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన 45 నుంచి 50 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. సుమారు 45రోజుల పాటు కాయల కోత ఉంటుంది. ఇతర పంటలతో పోల్చితే 3నెలల్లోపే పంట కాలం మొత్తం పూర్తి కావడం కాకర ప్రత్యేకత. ఎకరానికి 6 నుంచి 7టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో కాకర రూ.35 నుంచి రూ.40 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈ లెక్కన ఎకరానికి రూ.2.45 లక్షల నుంచి రూ. 2.80లక్షల వరకు ఆదాయం వస్తుంది. పంట సాగుఖర్చు పోను రూ.2.40 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

పంటల సాగు విధానం..

టమాటా పంటలో అంతర్ పంటలుగా బీన్స్, చిక్కుళ్లు, కాకర పంటలను కొత్తగా సాగు చేస్తున్నారు. టమటా ధరల నిలకడపైన అంతర్ పంటల సాగు ఆధారపడి ఉంటుంది. మార్కెట్లో టమాటా ధరలు బాగుంటే రైతులు వీటి జోలికిపోరు. అదే సమయంలో మార్కెట్లో టమాటా ధరలు తగ్గుముఖం పడితే సగం కోతలు అయిపోయిన తరువాత టమాటా మొక్కల వద్దనే బీన్స్, చిక్కుళ్లు , కాకర విత్తనాలు నాటేస్తారు. టమాటా పంటకు సరిపోయే నీటితోనే ఈ రెండు పంటలు చేతికి రావడం గమనార్హం.

అదనపు ఖర్చు ఉండదు

అంతర పంటల సాగుకు అదనపు ఖర్చు ఉండదు. టమాటా పంట సాగు కోసం పొలం ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలు, ల్యాడర్లే వీటికి సరిపోతాయి. మళ్లీ ప్రత్యేకంగా వీటి సాగు కోసం పొలాలు దుక్కులు చేయాల్సిన అవసరం లేదు. టమాటా పంట సాగు కాలం ముగిసే వరకు వాటికి ఉపయోగించే ఎరువులు, పురుగుల మందులే వీటికి సరిపోతుంటాయి. టమాటా పంట సాగు కోసం ఏర్పాటు చేసిన సీడ్ కట్టెలే వీటి ఎదుగుదలకు పనికొస్తాయి.

మార్కెటింగ్

బీన్స్, చిక్కుళ్లు, కాకర పంటలకు మార్కెటింగ్ సౌకర్యం బాగుంటుంది. తిరుపతి, కడప, తమిళనాడులోని చెన్నై, బెంగళూరు వంటి పట్టణాల్లో మార్కెటింగ్ బాగుంటుంది. ప్రత్యేకంగా తయారు చేసిన 50 కేజీల సంచుల్లో వీటిని ప్యాక్ చేసి వాహనాల్లో తరలిస్తుంటారు.

రోగాలు.. నివారణ పద్ధతులు

బీన్స్‌పంటకు..

మిగతా పంటలతో పోల్చుకొంటే బీన్స్ పంటసాగులో రోగాల బెడద కాస్త తక్కువే. పూతపిందె వచ్చే సమయంలో లద్దెపురుగులు పంట, చెట్టును ఆవహిస్తాయి. ఈ పంటను రసంపీల్చే పురుగులు(తెల్లదోమ, పేనుబంక) ఆశించడం వల్ల ఆకులు పండుబారి పోతుంటాయి. కాయతొలుచు పురుగులు కాయలోని పదార్థాలను తిని నష్టం కలిగిస్తుంటాయి.

నివారణ : విత్తనాలు విత్తిన వెంటనే ఎకరానికి పది కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు పిచికారీ చేయాలి. రసంపీల్చే పురుగుల నివారణకు డైమిథోయేట్, మిథైల్‌డెమిటాన్, మొటాసిస్టాక్స్, పాసలోన్, ఫిప్రానిల్ రెండు మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయతొలుచుపురుగు నివారణకు ఎండోసల్ఫాన్ 2 మి.లీ ఒకలీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణ కోసం 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గాముల డైఫోలో టాప్, ఒక లీటరు నీటికి కలిపి రెండువారాలు, ఐదు వారాలు, ఏడు వారాలు కొకమారు పిచికారీ చేసుకోవాలి.

చిక్కుడు, కాకర పంటలకు

మొక్కకు మొదటి దశలో పెంకు పురుగు ఆవహిస్తుంది. వీటికి తెల్లదోమ, నల్లదోమ, నల్లపేను వంటి రోగాలు పంటలను ఆవహిస్తుంటాయి. తామర పురుగులు, పేనుబంక పంటకు సోకడం వలన ఆకులు మరియు పూతపై ఆశించి కాయల్లోని పదార్థాలను తినేస్తుంటాయి. తుప్పతెగులు, అంత్రాక్నోస్, ఆకుమచ్చతెగులు వలన కాయలపై మచ్చలు ఏర్పడి నాణ్యత దెబ్బతింటుంది.

నివారణ : పెంకు పురుగు నివారణ కోసం కార్బరియల్2.5గ్రాములు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి. పేనుబంక, తామరపురుగు నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్‌డమిటాన్ మందు 2.5 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పదిరోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. కాయతొలుచుపురుగు నివారణకు ఎండో సల్ఫాన్ లేదా మలాథియన్ 2.మిలీ కార్బరిల్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉప్పతెగులు, అంత్రాక్నోస్, ఆకుమచ్చతెగులు రోగాల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాము లేదా డైఫోల్టాన్2,5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

రెండు పంటలు సాగు చేస్తాను



ప్రతి ఏడు టమాటా పంటలోనే రెండు పంటలను సాగు చేస్తుంటాను. సీజన్‌ను బట్టి, మార్కెట్లో ధరలను బట్టి టమాటాలో అంతర్ పంటలుగా బీన్స్, కాకర, చిక్కుళ్లు సాగు చేస్తుంటాను. మార్కెట్లో టమాటా ధరలు పడిపోతున్నాయనే సంకేతాలు వస్తున్నాయంటే అంతర్ పంటలను వెంటనే సాగు చేస్తాను. లేదా టమాటా పంట కాలం ముగుస్తుందనగా అందులో అంతర్ పంటలుగా బీన్స్, చిక్కుళ్లు, కాకర కాయల విత్తనాలు నాటేస్తాను. దీంతో పంట ఖర్చుసాగు తగ్గిపోయి పెట్టుబడి కలిసివస్తుంది.

- వెంకట్రమణ, రైతు, మొరంపల్లె

అంతర్ పంటలతో లాభాలు



అంతర్ పంటలు సాగు చేయడం వలన రైతులకు ఎంతో లాభం ఉంటుంది. కేవలం టమాటానే నమ్ముకొంటే ఒక్కోసారి గిట్టుబాటు ధరలు లభించవు. అలాంటి సమయంలో టమాటాలో అంతర్ పంటలుగా బీన్స్, చిక్కుడు, కాకర వంటి పంటలను సాగు చేసుకొంటే టమాటా సాగులో వచ్చిన నష్టాన్ని అంతర్ పంటల సాగుతో భర్తీ చేసుకొనే అవకాశముంటుంది. రైతులు ప్రయోగాత్మకంగా ఆలోచన చేసి ఇలాంటి పద్ధతిని వ్యవసాయంలో అనుసరించాలి.

- రత్నమ్మ, వ్యవసాయాధికారి, గుర్రంకొండ



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంతిల్లు వచ్చింది



గతంలో నాకు పాడు పడ్డ కొట్టం ఉండేది. వర్షం వస్తే ఇంటిలో ఉండేదానికి చాలా ఇబ్బంది పడేదానిని. చిన్నపాటి రేకుల ఇంట్లో ఉండేవాళ్లం. గత ప్రభుత్వాలు మాలాంటి వారికి ఎలాంటి సహాయం అందివ్వలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక మా బతుకులు మారాయి. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇంటి స్థలం ఇచ్చినారు. పట్టా ఇచ్చారు. సొంత ఇల్లు కూడా కట్టుకున్నాం. చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు మా కుటుంబం ఏ చీకూ చింతా లేకుండా ముందుకు సాగుతోంది. మా కుటుంబాన్ని ఆదుకున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

- క్రిష్ణవేణి, రెడ్డివారిపల్లె గ్రామం, రైల్వేకోడూరు మండలం

సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుంది



రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతోంది. కంప్యూటర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా బోధన అందిస్తుంటే సంతోషంగా ఉంది. దీనివలన విద్యార్థులకు తెలివితేటలు పెరుగుతాయి. మా పాఠశాలలో గతంలో కొద్దిగా మాత్రమే సౌకర్యాలు ఉండేవి. కాని నాడు–నేడుతో మా పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. మధ్యాహ్న భోజనం మొదలుకుని, దుస్తులు, బూట్లు , విద్యాసామగ్రితో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆంగ్ల మాధ్యమం ఉండటంతో ప్రవేటు పాఠశాలల కంటే ప్రభుత్వపాఠశాలల్లోనే విద్యార్థులు అధికంగా చేరుతున్నారు.

- అడ్లూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు, రైల్వేకోడూరు

ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తా

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక మేడా భవన్‌కు ఆదివారం విచ్చేసిన ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను రాజ్యసభ సభ్యునిగా ఎన్నిక చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. తనకు ఈ అవకాశం రావాడానికి తమ అన్న మేడా మల్లికార్జునరెడ్డి వేసిన పునాదులే కారణమన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో రానున్న 5 సంవత్సరాలలో రాజంపేటను సర్వముఖాభివృద్ధి చేస్తానని తెలిపారు. రాజంపేటలో ఆకేపాటి అమరనాథరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి ముఖ్యమంత్రి రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీసీ యోగీశ్వరరెడ్డి, గడికోట గుల్జార్‌బాషా, వడ్డే రమణ తదితరులు పాల్గొన్నారు.

నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన తప్పనిసరి



ట్విన్ డిస్ట్రిక్ట్ న్యూరో క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఏపీ ఎన్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షురాలు పి. విజయ

కడప కార్పొరేషన్ : నాడీ సంబంధిత వ్యాధులపై గ్రామీణ, మారుమూల గిరిజన ప్రాంతాలలో మరింత అవగాహన కల్పించేలా ట్విన్ డిస్ట్రిక్ట్ న్యూరో క్లబ్ సంస్థ కార్యక్రమాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యూరో వైద్యుల సంఘం (ఏపీ ఎన్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ సూచించారు. ఆదివారం నగరంలోని ద్వారకానగర్‌లో వైయస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన న్యూరో సర్జన్లు, న్యూరో ఫిజీషియన్లు సమావేశయ్యారు. ఈ సందర్భంగా ట్విన్ డిస్ట్రిక్ట్ న్యూరో క్లబ్‌ను ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ విజయ మాట్లాడుతూ ప్రజలకు నరాల వ్యాధుల గురించి మరింత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్లలో ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సీట్ బెల్ట్, అలాగే ద్విచక్ర వాహనాలలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలను కొంతవరకైనా అరికట్టవచ్చని చెప్పారు. అనంతరం ఏపీ న్యూరో వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఐ.బాబ్జి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ వైయస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన న్యూరో వైద్యులంతా ఈ సంస్థ ద్వారా సంఘటితంగా ఉండాలని ఉద్బోధించారు. సంఘం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షుడు అవ్వారు అర్జున్ కుమార్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు నాడీ సంబంధిత వ్యాధుల పట్ల మరింత చైతన్యం పెంపొందించేలా సంఘం ద్వారా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్విన్ డిస్ట్రిక్ట్ న్యూరో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్. కమ్మినేని ఆంజనేయులు, జనరల్ సెక్రెటరీ డాక్టర్ డి. జగదీశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఆర్.జయచంద్రా రెడ్డి, న్యూరో వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ జి.గణేష్, డాక్టర్ కె.జగదీష్ బాబు, డాక్టర్ నవీన్ ప్రసాద్, డాక్టర్ జె. మోహన్ సిద్ధార్థ్, డాక్టర్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని రక్షించి భూగోళాన్ని కాపాడుకుందాం



ఒడిశా రాష్ట్రానికి చేరిన శివశంకర్ సైకిల్ యాత్ర

ఓబులవారిపల్లె : అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండల కేంద్రానికి చెందిన బిమగోని శివశంకర్ నీటిని రక్షించి తద్వారా భూగోళాన్ని రక్షించుకుందాం అంటు ఓబులవారిపల్లె నుంచి నేపాల్‌కు సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఆదివారం ఒడిశా రాష్ట్రంలోకి ప్రవేశించాడు. బీమగోని శివశంకర్ తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందారు. అతను కూలి పనులు చేసుకొంటూ జీవన ం సాగిస్తున్నాడు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలనే లక్ష్యంతో ఫిబ్రవరి 12వ తేదీన ఓబులవారిపల్లె నుంచి సైకిల్‌పై నేపాల్ దేశ రాజధాని ఖాట్మండుకు యాత్రను ప్రారంభించాడు. చిట్వేలి, రాపూరు, నెల్లూరు, విజయవాడ మీదుగా సైకిల్‌పై ప్రయాణించి ప్రస్తుతం ఒడిశా రాష్ట్రానికి చేరుకొన్నాడు. శివశంకర్ చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతం కావాలని రైల్వేకోడూరు నియోజవర్గ ప్రజలు కోరుకుంటున్నారు.

దళితుని భూమిలో విధ్వంసం



దళితుని భూమిలో కంచెను పగులగొట్టి మామిడి చెట్లను పీకివేస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని కంబాలకుంట గ్రామానికి చెందిన పందికాళ్ల నారాయణ అనే దళిత రైతు భూమిలో కొందరు విధ్వంసం సృష్టించారు. సింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన బోగాబత్తిన ఉమాశంకర్ రౌడీలతో దాడి చేసి కంచె, మామిడి చెట్లు పెరికి వేసినట్లు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సింగారెడ్డిపల్లి పంచాయతీలోని సర్వే నంబరు. 729/3లో 4.58 ఎకరాలు భూమి నారాయణ తండ్రి పేరుతో గత 20 సంవత్సరాలుగా వీరి అనుభవంలోనే ఉంది. నారాయణ తండ్రి మృతి చెందడంతో ఆ భూమిని నారాయణ పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నాడు. రెండు సంవత్సరాల క్రితం నుంచి భూమికి కంచె వేసుకున్నారు. మామిడి చెట్లు కూడా నాటారు. సింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉమా శంకర్ బయట ప్రాంతాల నుంచి 40 నుంచి 50 మంది రౌడీ ముకలను తీసుకొని రాతిపోళ్లను ధ్వంసం చేసి పూడ్చిన మామిడి చెట్లను పెరికివేశారు. నారాయణ, కుటుంబ సభ్యులు చూస్తుండగానే దాదాపు 50 మంది రౌడీముకలు కర్రలు, రాళ్లు చేతబట్టి భూమిలో నానా హంగామా చేశారు. బాధితులు బోరున విలపించినా వినకుండా కంచె పగులకొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. సింగారెడ్డిపల్లికి చెందిన ఉమా శంకర్ అనే వ్యక్తి నారాయణ కుటుంబాన్ని కులంపేరుతో దూషిస్తూ నానా హంగామా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉమా శంకర్ నుంచి తమ కుటుంబాన్ని కాపాడాలని వారు వేడుకున్నారు.

తండ్రి కళ్లెదుటే.. తనయుడి దుర్మరణం

- పొలం వద్ద స్టార్టర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్
- అక్కడికక్కడే సీఏ విద్యార్థి మృతి
- కె.రాజుపల్లెలో విషాదం



మురికినాటి చెన్నకేశవ రెడ్డి(ఫైల్)

చక్రాయపేట : మరో రెండు మూడు నెలల్లో సీఏ కోర్సు పూర్తవుతుంది. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పి నాలుగు రోజులు ఇంటివద్దే ఉండి ఆపై కాలేజీకి వెళ్లి పరీక్షలు రాసి ఇంటికి వస్తానని చెప్పేందుకు సొంతూరికి వచ్చాడు. ఇంటి వద్ద హాయిగా గడిపాడు. పొలంలో వేరుశనగ పంట వద్ద ఉన్న తన తండ్రికి భోజనం ఇచ్చి రావడానికి వెళ్లాడు. ఇక అటు నుంచి అటే అనంతలోకాలకు వెళ్లాడు. తమ బిడ్డ తమకు అండగా ఉంటాడని కలలు గన్న వృద్ధ దంపతుల ఆశలను కరెంటు కాటేసింది. ఈ హృదయ విదారక సంఘటన చక్రాయపేట మండలం కె.రాజుపల్లెలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కె.రాజుపల్లెకు చెందిన మురికినాటి వాసుదేవరెడ్డి, లక్ష్మీదేవమ్మల కుమారుడు చెన్నకేశవరెడ్డి నెల్లూరు లోని ఓ ప్రైవేట్ కళాశాలలో సీఏ చివరి సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులు సెలవులు ఉన్నాయని ఇంటికి వచ్చాడు. మరో రెండు రోజుల్లో తాను కాలేజీకి వెళ్లాలని ఇంటిలో కూడా చెప్పాడు. అయితే ఆదివారం పొలానికి నీళ్లు కట్టేందుకు వెళ్లిన తండ్రికి భోజనం ఇచ్చి రావడానికి కారియర్ తీసుకొని బయలుదేరాడు. ద్విచక్రవాహనం ఎక్కే సమయంలో క్యారియర్ కింద పడిన విషయం గమనించిన తల్లి నీవు వెళ్లొద్దు తాను తీసుకొని వెళతానని వారించినా వినకుండా పొలంవద్దకు వెళ్లాడు. అక్కడ తండ్రికి క్యారియర్ ఇచ్చాడు. అంతలోనే తండ్రి వాసుదేవరెడ్డి కరెంటు వచ్చిందేమో స్టార్టర్ ఆన్ చేసి వెళ్లమని చెప్పడంతో అక్కడి నుండి మోటారు వద్దకు వెళ్లాడు. స్టార్టర్ వద్ద వైర్లు తెగిన విషయం గమనించక కాలు పెట్టగానే షాక్‌కు గురై పక్కనే ఉన్న వైర్ల మీద పడ్డాడు. దీంతో పక్కవైర్లు కూడా తెగి మీద పడటంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం గ్రామంలో తెలియగానే అందరూ అక్కడికి చేరుకొని కన్నీటి పర్యంతం అయ్యారు. జరిగిన సంఘటనపై చక్రాయపేట పోలీసులతో పాటు విద్యుశాఖ అధికారులకు సమాచారం అందించారు. మృతదేహానికి వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో శవ పరీక్షలు చేయించినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైఎస్ కొండారెడ్డి నివాళులు

విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన చెన్నకేశవ రెడ్డి మృతదేహానికి వేంపల్లె ప్రభుత్వ వైద్యశాల వద్ద చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి నివాళులు అర్పించారు. జరిగిన సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న మృతుడి తండ్రి వాసుదేవరెడ్డిని ఓదార్చారు. ఆయన వెంట బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ప్రసాదరావు, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి. మండల యూత్ కన్వీనర్ రామాంజులరెడ్డి, జనార్దన్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ టెక్నాలజీతో మోకాళ్ల మార్పిడి



బహుమతులు గెలుపొందిన విద్యార్థులతో అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని విద్యాసాగర్ హాస్పిటల్‌లో రాయలసీమలో ప్రప్రథమంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించి మోకాలు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ సురేష్‌బాబు, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యాసాగర్ హాస్పిటల్ గత 15 సంవత్సరాలుగా జిల్లాతోపాటు కడప నగర వాసులకు మోకాలు, కీళ్ల సమస్యలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తోందన్నారు. నిష్ణాతులైన వైద్య బృందానికి 5800 లకు పైగా మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు చేసిన అనుభవం ఉందన్నారు. ఇంపోర్టెడ్ మోకాలు పరికరాలు, లామినార్ ఎయిర్ ఫ్లో థియేటర్స్ , అత్యాధునిక సదుపాయాలతో 50 పడకల ఆర్థోపెడిక్ హాస్పిటల్‌తోపాటు అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని జతపరచడం ద్వారా 100 శాతం మెరుగైన ఫలితాలను పొందగలరని వివరించారు. అనంతరం డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ మోకాలు కీళ్ల మార్పిడికి సంబంధించి తాము విశేష సేవలు అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా కొన్ని వేల శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇప్పటివరకు కంప్యూటర్ నేవిగేషన్ పద్ధతి ద్వారా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుండగా కాలంలో వచ్చిన మార్పులు, ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా ప్రస్తుతం రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించి మోకాలు కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ ద్వారా ఖచ్చితత్వాన్ని పాటిస్తూ రోగికి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తామని వివరించారు. ఈ ఆపరేషన్ ద్వారా తక్కువ నొప్పి, త్వరితగతిన కోలుకోవడం, అమరిక, అలైన్‌మెంట్, స్థిరత్వం ఖచ్చితత్వంగా ఉంటుందన్నారు. ఒకసారి మోకాలి శస్త్ర చికిత్స ద్వారా జీవితాంతం సమస్యలు రాకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా గతంలో లాగానే జీవనం సాగించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. మోకాలు, కీళ్లకు సంబంధించి శస్త్ర చికిత్సలు అవసరమైన వారు తాము అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఇటీవల రోల్ ఆఫ్ రోబోటిక్ టెక్నాలజీ ఇన్ ఫ్యూచర్ అనే అంశంపై నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది, స్మిత్ నెఫ్రూ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.